# అభాగ్యుడు

రచన:
శ్రీ. కలగర్ల నరసింహమూర్తి

'కమలా ఏమిటి నీ మూర్ఖత్వం? ఇలా చెయ్యటంలో నీ అభిప్రాయం ఏమిటి? ఇప్పుడు ఉదయం ఎనిమిది గంటలయింది. నేను సరిగ్గా 9-30 కొట్టేసరికి ఆఫీసుకు వెళ్లాలని, నీకు బాగా తెలుసు. నిజం చెబుతున్నాను విను కమలా! నువ్వు ఇదే మాదిరిగా ప్రవర్తిస్తుంటే, నేను నీతో ఆట్టేకాలం వేగలేను. నేను సావిత్రిని పెళ్లాడి, ఈ ఇంటికి తెచ్చిన నాటినుండి, ఎందువల్ల నువ్వు ఈ విధంగా, నా మీద పగ సాధిస్తున్నావ్?' అన్నాడు ప్రభాకర్ కోపంగా.

కమల ఏమీ మాట్లాడలేదు. కడుపును చేతితో పట్టుకొని నిశ్శబ్దంగా కూర్చుంది ఆవిడ. అతనికి ఎటువంటి సమాధానము ఇవ్వక పోయేసరికి అతని ఆగ్రహం అధికమయింది. రాక్షసుడిలా, అతడు ఆమెపైన పడి ఆమెను జుత్తుపట్టుకొని, నేల మీద బర బర మని ఈడ్చి, చేతులు నొప్పి పుట్టేటంత వరకు, ఆమెను బాది తరువాత ఒక్కతాపు తన్నాడు ఆమె దొర్లుకొని పోయి, గదిలో ఒక మూల పడిపోయింది.

'అంటే, నువ్వు జవాబు ఇవ్వకూడదని పంతం పట్టావన్నమాట రాస్కెల్! ముళ్ల మధ్య పడి ఉన్న నిన్ను, నేను ఎట్లు రక్షించి సుఖ పెట్టానో, అవన్ని పూర్తిగా మరచిపోయావన్నమాట! నేను సావిత్రిని పెళ్లాడింది నీ ఇష్టం మీదనే కాదూ? కానీ ఇప్పుడునువ్వేమీ, మాట్లాడ్డం లేదు. సావిత్రితో కూడా నువ్వు సరిగ్గా ప్రవర్తించడంలేదు. ఇంట్లోని పనులు కూడా ముట్టడంలేదు. నిన్ను ఇంటికి పెద్దగా జేసి, నేను నీ మీద పూర్తిగా ఆదార పడి ఉన్నందుకు నాకు మంచి బుద్ది చెప్పేవ్!

సావిత్రి ఈఇంట్లో అడుగు పెట్టిన కొత్తలో కొద్దిరోజులు మాత్రం, నువ్వు ఉత్సాహంగా ఉండి, నాకు సావిత్రికి ఆనందం కలిగించావ్. కానీ నీ పుత్రరత్నం అకస్మాత్తుగా మరణించగానే, నువ్విలా మూగదయ్యంలా తయారయ్యావ్! నీకేమయిందే పిశాచీ!

అనలు ఇంత అకస్మాత్తుగా సావిత్రి పుట్టింటికి ఎందుకు వెళ్ళిపోయిందో నువ్వు గ్రహించావా? నీ మౌనం, ఏడుపు గొట్టు మొహం ఇవే అందుకు కారణం. నువ్వు కనీసం ఆవిడతో మాట్లాడలేదు. దాని సంతోషాన్ని నాశనంచేసావ్. నీ నిశ్శబ్దమైన ప్రవర్తన, వెధవ కన్నీళ్లు కలసి, నా సావిత్రిని ఈ ఇంటి నుండి వెళ్ల గొట్టాయి. నువ్వే ఈ ఇంటికి యజమానురాలులా ఉన్నావని, తనకా ఇంటిలో ఎటు వంటి స్థానము లేనట్టుందని సావిత్రి నన్ను ఎన్నోసార్లు చెప్పింది.

నేను సావిత్రిని ఓదార్చి, బుజ్జగించి అటువంటి ఆలోచనలు పెట్టుకోవద్దని, ఎటువంటి భయము పడనక్కర్లేదని చెప్పాను. కానీ సావిత్రి నీ పేరు వినీ వినడంతోనే, తనచక్కని ముఖాన్ని ముడుచుకొని, కన్నీళ్లు పెట్టుకోడం, నేను ఎన్నో సార్లు గమనించాను. కమలా! నువ్వు ఆడదానివి కావు. నువ్వొక విషనాగువి, నువ్వేదో చేసి, నా సావిత్రిని భయపెట్టి ఉం

టావ్. దయచేసి కమల గురించి, నాతో ఏం మాట్లాడకండి అంటూ ఏడ్చింది సావిత్రి. రాత్రివేళ మంచం మీద, గోడవంకకు తిరిగి సావిత్రి ఏడవటం నేను గమనించాను.

నేను అడిగిన ప్రశ్నకు ముక్తసరిగ్గా జవాబు ఇవ్వటం తప్పించి, సావిత్రి నాతో మూడు రోజులవరకు నాతో ఇంకేం మాట్లాడ లేదు. ఏమయిందని నేను ఎంత ప్రేమతో అడిగినా, జవాబు చెప్పలేదు. అబ్బే! ఏం లేదు అన్నట్టు తలను అడ్డంగా త్రిప్పి. తిరిగి గోడ వైపుకు తిరిగి పోయేది. నాలుగోనాడు, ఆమెకు ఏదో ఉత్తరం వచ్చింది కాబోలు, ఆతృతగా చదువుతోంది. నేను లోనికి రాగనే గభాలున ఉత్తరం మడచి దాచేసింది. కానీ నేనా విషయాన్ని చూడలేదనుకుంది. నన్ను చూడగానే ఎంతో సంతోషంతో పొంగి పోతూ, గభాలున వచ్చి నన్ను గట్టిగా కౌగలించుకొని, నా పెదిమల మీద ముద్దుల వర్షం కురిపించింది. ఆనాడు నా సావిత్రి తిరిగి మామూలుగా ఎంతో ఆనందంగా, ఖుషీగా ఉంది. ఆ ముఖంలో ఏదో చెప్పలేని అనందం, క్రొత్త కాంతి మెరుస్తున్నాయ్.

గత శనివారం కాబోలు. నేను ప్రక్క మీదనుండి లేచి చూసేసరికి, టేబిల్ మీద ఉత్తరం కనిపించింది. తను పుట్టింటికి వెళు తున్నానని, తిరిగి వచ్చేటప్పటికి ఎన్నాళ్ళవు తుందో చెప్పలేనని, తనకోసం బెంగపెట్టుకో వద్దని అందులో సావిత్రి రాసింది. కమలా! కొత్తగా పెళ్ళి చేసుకున్న యవ్వనవతి, తన భర్తనిలా విరహ బాధకు లోనుజేసి, ఒంటరిగా పుట్టింటికి వెళ్ళి పోవడం, వింతగా లేదూ?''

కడుపుమీద తగిలిన దెబ్బతో, బాధగా మూలుగుతూ కమల అంతావిన్నది. తనకు కలిగిన గర్భశోకం, అతనికెలా తెలుస్తుంది? జుత్తుపీక్కొని గట్టిగా ఏడవాలని పించింది కమలకు. కానీ ఎన్ని కష్టాలొచ్చినా ఆపుకో గల శక్తి, ఎంత దుఃఖం వచ్చినా, నిగ్రహిం చుకోగల ఓర్మి కమలలో ఉన్నాయ్.

ప్రభాకర్ సింహంలా గర్జిస్తూ ''చూడు కమలా! నేను సరిగ్గా రెండు గంటలకు తిరిగి వస్తాను. నేను కొన్నాళ్ళు సెలవు తీసుకొని, నా సావిత్రి దగ్గరకు వెళదామను కుంటు న్నాను. ఆవిడను తిరిగి ఎలా గైనాసరే త్వరలో తీసుకొని రావాలి. నేను రెండు గంటకు వచ్చే టప్పటికి అన్నీ సిద్ధంగా ఉండాలి. స్నానా నికి వేడి నీళ్ళు, భోజనం, రెడీగా ఉండాలి. గుర్తుంచుకో! నాకు భోజనం లోనికి కావల సిన రుచులన్నీ సిద్ధం చెయ్యాలి. లేదా, నేను నిన్నేం చేస్తానో తెలుసా? దూలానికి వేలాడి గట్టి, నిన్ను ఉరితీస్తాను. ఖబర్దార్!'' అంటూ బెదిరించి, ప్రభాకర్, ఆగ్రహంతో బైటకు వెళ్తూ, తలుపును గట్టిగా కాలితో తన్ని, మరీ వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఒక గంట గడించింది. కమల లేని ఓపికను తెచ్చుకొని, మెల్లగా బాధతో మూలుగుతూ లేచింది. భర్త కొట్టిన దెబ్బ లతో, ఆవిడ శరీరమంతా హూనమై పోయింది. పైగా రాత్రినుండి భోజనం లేక పోవడంవల్ల బాగా ఆకలి వేస్తున్నట్టయింది,

వంటింటిని కడిగి, వంటకు ఉపక్రమించింది కమల. చావో, బ్రతుకో తేల్చుకో అన్నట్లున్న ఒక భయంకరమైన సమస్య తనకు ఈ నాడు జీవితంలో ఎదుర్కొంది. పన్నెండేళ్ళ క్రితం...తనకు ఇరవై రెండేళ్ళు ప్రభాకర్‌కు ఇరవై ఏళ్ళ వయస్సప్పుడు...తామిద్దరూ అప్పుడప్పుడు కలుసుకున్నారు. అప్పటికే, తనకు శర్మ అనే అతనితో వివాహం అయింది. శర్మ, పగటివేళ బాగానే చూడగలిగేవాడు. కానీ సాయంత్రం అయిన దగ్గరనుండి, అతనికి బొత్తిగా కనిపించేది కాదు. అతనిని ఎంతో మంది నేత్ర వైద్యులు పరిక్షించి, లాభం లేదని పెదవి విరిచారు. ఇంగ్లాండు నుండి వచ్చిన ఒక స్పెషలిస్టు, శర్మను పరీక్షించి "లాభంలేదు. నిశ్చయంగా ఇతడు ఇంకో మూడేళ్ళలో పూర్తిగా గుడ్డి వాడవుతాడు" అని చెప్పేసాడు. ప్రభాకర్ శర్మకు స్నేహితుడు అప్పటికి ప్రభాకర్, చదువు ముగించుకొని వచ్చి, ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. అతడు శర్మ, ప్రక్కటింలో ఒక గదిని అద్దెకు తీసుకున్నాడు. అప్పుడప్పుడు ప్రభాకర్, బాతాఖానికోసం, శర్మ ఇంటికి వచ్చేవాడు. శర్మ కూడా, ఎంతో ఆనందంగా ప్రభాకర్‌ను ఆహ్వానించి, కులాసాగా కబుర్లతో హాయిగా కాలక్షేపం చేసేవాడు.

అప్పటికే ప్రభాకర్, కమల, దొంగతనంగా ప్రేమించుకోవడం ప్రారంభించారు. అవకాశం దొరికితే ఏ తలుపు ప్రక్కనో, ఏ గోడ చాటునో, ఇద్దరూ చేతులు నొక్కుకోవడం, ఆతృతతో గబాలున కౌగలించుకోవడం, కళ్ళతోనే మాట్లాడుకోవడం చేస్తూ ఉండేవాళ్లిద్దరూ. ఈ ప్రేమ ప్రారంభమైన నాటికే, కమలకు శర్మవలన కలిగిన రెండేళ్ళ కుమార్తె ఉంది. ఆ పిల్ల ఎంతో చక్కగా ముద్దుల మూటగట్టేది. కానీ ఒక విషజ్వరం వచ్చి, ఆ పిల్ల ఒకనాడు అకస్మాత్తుగా చనిపోయింది. అ పిల్ల మరణంతో కమలకు ఆ ఇంట్లో ఉండటానికి మనస్కరించలేదు. పైగా భర్తకూడా గుడ్డివాడు కాబోతాడని డాక్టర్ చెప్పనే చెప్పాడు. ఇవన్నీ తలచుకొని కమల, ఆ ఇంట్లోనుండి పారిపోదామని నిశ్చయించుకుంది. అందుకు తోడుగా తనకు ప్రభాకర్ స్నేహం ప్రేమ లభించినాయ్. తన భర్తను చూచుకోడానికి, తన అత్తగారు, అంటే శర్మ తల్లి ఉండనే ఉంది. అందువల్ల తను ప్రభాకర్‌తో పారిపోయినా, తన భర్తకు ఇబ్బంది కలగదు. ఇలా నిశ్చయించుకొని ఒకనాటి తెల్లవారగట్ల...ఇంకా బాగా చీకటిగా ఉండగానే, కమల ప్రభాకర్‌తో లేచిపోయింది. ప్రేమ పక్షులు రెక్కలు విప్పుకొని స్వేచ్ఛాకాశంలోనికి ఎగిరిపోయాయి.

సరిగా ఒక ఏడాదిపాటు, తాను ప్రభాకర్, ఊర్లన్నీ తిరుగుతూ హాయిగా కాలం గడిపారు. కమలకోసం, శర్మ ఎటువంటి ప్రయత్నమూ చెయ్యటంలేదని తెలిసిన తర్వాత, ఇద్దరూ నిర్భయంగా, బహిరంగంగా, ప్రభాకర్ స్వంత ఊర్లోనే కాపురం పెట్టారు. ప్రభాకర్‌కు అదృష్టవశాత్తు మాంచి ఉద్యోగం దొరికింది. అందువల్ల డబ్బుగురించి ఆలోచించనవసరం లేకపోయింది. కానీ మెల్లగా

(తరువాయి 22వ పేజీలో)

(18వ పేజీ తరువాయి)

సంవత్సరాలు గడచినకొద్ది ప్రభాకర్‌కు కోపం ఎక్కువ కాసాగింది. అతడొక, భర్తగల స్త్రీని ఎత్తుకొనివచ్చి పెళ్ళి చేసుకున్నందుకు సంఘం, అతని బంధువులు అతనిని నీచంగా నిందించసాగారు. 'నీమూలాన్నే నా జీవితం ఇలా నాశనమయింది. నా బుద్ధితక్కువ కాక పోతే, నాకంటే వయస్సులో పెద్దదానివి, నిన్ను నేను పెళ్ళాడ్డమేమిటి?' అంటూ ప్రభాకర్ అప్పుడప్పుడు కమలమీద విసుక్కోనారంభించాడు. ఇవన్నీ భరించలేక కమల ఒకనాడు ప్రభాకర్‌తో తిరిగి ఇంకో మంచి కుటుంబంలోని పిల్లను చూసి పెళ్ళిచేసుకోమని, సలహా ఇచ్చింది. 'చూడండి! మీరు ప్రసాదించిన పాపాయి ఉన్నాడు. నాకు చాలు. మీరు పెళ్ళిచేసుకున్నతర్వాత, నేను మీనుండి దూరంగా నా పాపాయితో కలసి, ఎక్కడికైనా వెళ్ళిపోతాను' అని కూడా కమల ప్రభాకర్‌కు వాగ్దానం చేసింది.

అతడు తన మాటప్రకారం, ఇంకో పెళ్లి చేసుకున్నాడు. కానీ తనుమాత్రం తన వాగ్దానాన్ని నిలబెట్టుకుందా? అతడు తనను తన క్రొత్త భార్యను ఒంటరిగా విడిచిపెట్టి, కమల వెళ్ళిపోతుందని ఆశించాడు. ఐతే కమల తిరిగి తన భర్తదగ్గరకు వెళ్ళగలదా? పైగా, తల్లి చనిపోయినతర్వాత, శర్మ ఎవరో దూరపు బంధువుల ఇంటిలో ఉంటున్నాడని కమలకు తెలిసింది. శర్మ, కమలను తిరిగి తన భార్యగా పరిగ్రహించడం, అసంభవం. అలాగే కమల, తిరిగి తన పుట్టింటికి వెళ్ళడంకూడా, జరగనిపని. నిజానికి ఆమె వాళ్ళ దృష్టిలో, ఏనాడో పతితగా మారి మరణించింది.

సంఘం ఆమెను పూర్తిగా బహిష్కరించింది. ఇన్నేళ్ళు ఈ ఇంటిలో ఆమె తనను ఎంతో గాఢంగా ప్రేమించిన భర్తతో కాపురం చేసింది. కానీ ఇప్పుడు అతనికి కూడా తను అక్కర్లేదు. ఇప్పుడతను, తనను తిడుతూ కొడుతూ బాధిస్తున్నాడు. అతడు, తనను ఒక కూలిదానికంటే హీనంగా చూస్తున్నాడు. అతడు పెడుతున్న బాధలు మూలంగా, ఎక్కడికైనా పారిపోదామని తనకు అనిపిస్తోంది. ఎన్ని దెబ్బలు కొట్టినా ఆమె భరించగలదేమోగానీ, తన హృదయాన్ని కోతలు కోస్తున్నమాటలంటూ ఉంటేమాత్రం ఆమె భరించలేకపోతూ ఉంది.

కమల శుభ్రంగా స్నానంచేసింది. వండిన భోజనాన్ని కడుపునిండా భుజించింది. త్వరగా ఏదో ఒక నిశ్చయానికి రావాలనుకుంది. ఆమెకు తెలుసు...తన అవసరం ఇప్పుడు ఎవరికీలేదని,...ఇప్పుడు తనను ప్రేమించేవారు కూడా ఎవరూలేరని అనుకున్నపని చేసేసింది.

రెండు గంటలకు కోపంతో మండిపోతూ ప్రభాకర్ ఇంట్లోనికి ప్రవేశించాడు. తిన్నగా వంటింటిలోనికి వెళ్ళాడు. వంటింటిలో కనిపించిన ఒక దృశ్యం చూసి, అతని గుండెలు ఒక్క క్షణం ఆగిపోయినాయి.

కమల శవం పడిఉంది. ఇహ నన్నేం చెయ్యగలవ్ అన్నట్టు ప్రభాకర్‌కుఅనిపించింది.

చేసిన పాపానికి తగిన శిక్ష అనుకున్నాడు. దహన సంస్కారానంతరం తన కొత్త భార్య, సావిత్రిని కలుసుకోడానికి ప్రభాకర్ వెళ్ళాడు అప్పటికే సావిత్రి తను ప్రేమించిన మరొక యువకునితో పారిపోయింది. ప్రభాకర్‌కు మతి చెలించింది. పిచ్చివాడైనాడు. వీధివీధులా తిరుగుతూ కమలా - సావిత్రి అంటూ అరుస్తూ పోతుంటాడు. ఎవరయినా ఎదుటపడితే నా సావిత్రి - కమల ఏది? అని అడుగుతూంటాడు. ఇప్పటికీ.